క్లుప్తంగా

అందుబాటులో కాంప్లెక్స్ ఎరువులు



కల్వకుర్తి రూరల్: రైతులకు పీఏసీఎస్ గోదాంలో కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్దన్ రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలో సీఈఓ వెంకట్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. డీఏపీ 20.20.13, పొటాష్ 28.28.0,14.35.14 యూరియా అందుబాటులో ఉందని పేర్కొన్నారు. బీపీటీ వరి విత్తనాలు ఆర్ఎన్ఆర్ రకం, కేఎన్ఎం రకం, పచ్చిరొట్ట విత్తనాలు, జీలుగ విత్తనాలు, మొక్కజొన్న విత్తనాలు గోదాంలో నిల్వ ఉన్నాయని వివరించారు. కల్వకుర్తి, ఊర్కొండ మండలాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కోడేరు: మండలంలోని నాగులపల్లి గ్రామానికి చెందిన నర్సమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. బుధవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దూరెడ్డి రఘువర్ధన్‌రెడ్డి బాధితకుటుంబాన్ని పరామర్శించి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మండల అధ్యక్షులు రాజశేఖర్‌గౌడ్, మాజీ సర్పంచ్ వెంకటస్వామి, యాపచెట్టు లాలు, శ్రీశైలం, రాజు, తదితరులు ఉన్నారు.

గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలి

కల్వకుర్తి రూరల్: కల్వకుర్తి నియోజకవర్గంలో గిరిజన గురుకుల బాలుర పాఠశాలను ఏర్పాటు చేయాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకుడు చంద్రు నాయక్ నియోజకవర్గ నాయకుడు రాంజీనాయక్ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. నియోజకవర్గంలో 270 తండాలు 60 వేల జనాభా ఉందని వివరించారు. ఆర్థిక భారంతో చాలామంది చదువుకు దూరమవుతున్నారని వాపోయారు.

మహాధర్నాకు తరలిన యువకులు

కల్వకుర్తి రూరల్: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాకు కల్వకుర్తి ప్రాంతం నుంచి పలువురు జాగృతి నాయకులు బుధవారం హైదరాబాద్ తరలివెళ్లారు. ఈ సందర్భంగా జాగృతి జిల్లా కన్వీనర్ దారముని గణేష్ మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్‌కు ప్రభుత్వం కుట్రపూరితంగా నోటీసులు అందజేయడంతో దీనికి నిరసనగా ధర్నా చేపట్టినట్లు పేర్కొన్నారు. అజయ్, నవీన్, రాఘవ, ఉదయ్ శంకర్, శ్రీను, రాకేష్ తదితరులు ఉన్నారు.

అచ్చంపేట సీఐగా నాగరాజు



అచ్చంపేట రూరల్: అచ్చంపేట పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బుధవారం నాగరాజు బాధ్యతలు స్వీకరించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో సీసీఎస్ సీఐగా పని చేసిన నాగరాజు బదిలీపై అచ్చంపేటకు రాగా ఇక్కడ విధులు నిర్వర్తించిన సీఐ రవీందర్ జిల్లా ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేశారు. బాధ్యతలు చేపట్టిన సీఐ నాగరాజును పలు సంఘాల నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్ఐలు రమేష్, వెంకట్‌రెడ్డి స్వాగతం పలికారు.

మూలవాగును ఆధునీకీకరించాలి

కొల్లాపూర్: పట్టణ సమీపంలోని మూలవాగును ఆధునీకీకరించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి యూసూఫ్ అధికారులను కోరారు. చుక్కాయిపల్లి చెరువు నుంచి రామాపురం పెద్ద వాగు వరకు మూలవాగు ప్రవహిస్తోందని, వాగు వెంట పేదల ప్లాట్లు ఉన్నాయని వివరించారు. వాగును ఆధునీకరించకపోవడంతో ముళ్లచెట్లు పెరిగి నీరు ముందుకు పారడం లేదన్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం వాగు హద్దులను ఏర్పాటుచేసి, బఫర్ జోన్ కూడా నిర్ధారించాలన్నారు. బఫర్ జోన్ ఏర్పాటు చేయకపోవడంతో సమీపంలోని ప్లాట్లన్నింటికీ ఎల్ఆర్ఎస్ కట్టించుకోవడం లేదన్నారు. ప్రజలకు అనేక రకాలుగా ఇబ్బందికరంగా మారిన మూలవాగుపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని ఆయన కోరారు.

ఘనంగా చల్లా జన్మదిన వేడుకలు

కల్వకుర్తి: మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచందర్ రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం కల్వకుర్తిలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో కేకును కట్ చేసి, టపాసులు పేల్చారు. కాయతివిజయకుమార్ రెడ్డి, మిర్యాల శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ఆనంద్‌కుమార్, లింగం, రాహుల్, వంశీ, విజయ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

మూతపడుతున్న పాఠశాలలు

- ప్రైవేట్ పాఠశాలలకే విద్యార్థుల మొగ్గు



గతేడాది తుమ్మలకుంటతండాలో మూసివేసిన పాఠశాల



మూడేళ్ల కిందట మూతబడిన కంటోనిపల్లిలో ప్రభుత్వ పాఠశాల

వెల్దండ: ప్రభుత్వ పాఠశాలలకు ఎన్ని చర్యలు తీసుకున్నా సత్ఫలితాలను ఇవ్వడంలేదు. కొన్ని గ్రామాల్లో విద్యార్థులు లేక పాఠశాలలు వెలవెలబో తుండటంతో పాఠశాలలను మూసివేయక తప్పడం లేదు. ప్రతి ఏడాది విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. పాఠశాలలో కొత్తగా విద్యార్థులు చేరకపోవడంతో మూసివేస్తున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాల 50, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 7, మొత్తం 57 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో గతేడాదిలో కేవలం 1302 మంది విద్యార్థులు ఉన్నారు. 10 ఏళ్ల కిందట మండలంలో దాదాపుగా 4 వేలకు పైగా ఉండే విద్యార్థులకు క్రమంగా తగ్గిపోతుందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ఇలా కొనసాగితే మరో ఐదేళ్లలో గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు శాశ్వతంగా మూతపడడం ఖాయమని భావిస్తున్నారు. ప్రభుత్వాలు ఎన్ని పథకాలు ప్రవేశపెట్టిన పాఠశాలల్లో విద్యార్థులు చేర డం లేదు. విద్యార్థులను చేర్చే విధంగా ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాలు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం లేకపోవడంతో విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల వైపే మొగ్గు చూపుతున్నారు. మండలంలోని దాదాపుగా సగానికి పైగా గ్రామాల్లో కల్వకుర్తి, ఆమనగల్లు, వెల్దండలోని ప్రైవేట్ పాఠశాలలకు విద్యార్థులు వెళ్తున్నారు.

విద్యార్థులు లేని పాఠశాలలు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరకపోవడంతో మండలంలో ఇప్పటికే 8 పాఠశాలలు మూసివేశారు. విద్యార్థులు లేని పాఠశాలలు బద్రిగానితండా, బుడోనిపల్లి, బుగ్గకాల్వతండా, కల్యాణ్‌వాగుతండా, కంటోనిపల్లి, కేస్లీతండా, నెమిలిగుండుతండా, తుమ్మలకుంటతండాలు ఉన్నాయి. మరో 18 పాఠశాలల్లో విద్యార్థులు పది విద్యార్థుల కంటే ఎక్కువ లేరు. ఈ ఏడాదిలో మరికొన్ని పాఠశాలలు మూతపడే అవకాశం ఉందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ప్రతి ఏడాది గురుకులాల ప్రవేశాల్లో సీట్లు రావడంతో విద్యార్థులు వెళ్లిపోతున్నారు. దీంతో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 6వ తరగతిలో కొత్తగా చేరడం లేదని ఉపాధ్యాయులు తెలిపారు. దీంతో పాఠశాలల్లో 7వ తరగతి నుంచి 10వ తరగతిలో విద్యార్థులు తగ్గిపోతున్నారు.

ప్రవేశాలు పెంచేందుకు కృషి



పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించడానికి బడిబాట కార్యక్రమాలను చేపడుతున్నాం. పాఠశాలల ప్రారంభంలో పాఠశాలను తెరిపిస్తున్నాం. రెండు, మూడు నెలలు వరకు ఎవరు చేరకపోతే మరో పాఠశాలకు ఉపాధ్యాయులను పంపిస్తున్నాం. ప్రవేశాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ ఏడాది అన్ని పాఠశాలల్లో విద్యార్థులు ఉండే విధంగా కృషి చేస్తున్నాం.

–చంద్రుడు, ఇన్‌చార్జ్ ఎండీఓ, వెల్దండ

సైబర్‌నేరగాళ్లతో అప్రమత్తత అవసరం



మన్ననూర్‌లోని రైతువేదిక ప్రాంగణంలో మాట్లాడుతున్న సీఐ శంకర్‌నాయక్

చారకొండ/మన్ననూర్/లింగాల: సైబర్‌నేరగాళ్లతో అప్రమత్తత అవసరమని క్రైం డీఎస్పీ గిరికుమార్ కల్కోట, అమ్రాబాద్ సీఐ శంకర్ నాయక్, లింగాల ఎస్ఐ వెంకటేష్‌గౌడ్ అన్నారు. చారకొండ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎస్ఐ శంషోద్దీన్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ పోలీసింగ్, మన్ననూర్‌లోని రైతువేదిక ప్రాంగణం, లింగాల మండలంలోని అవుసలికుంటలో సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్‌నేరగాళ్ల బారిన పడితే 1930 నంబర్‌కు కాల్ చేయాలని కోరారు. ఇంటర్‌నెట్, మాధ్యమాల ద్వార ప్రకటనలతో మభ్యపెట్టి మోసాలకు పాల్పడుతున్నారన్నారు. వ్యక్తిగత సమాచారం ఎవరికి చెప్పొద్దన్నారు. గుర్తుతెలియని వ్యక్తులకు ఓటీపీలు చెప్తే బ్యాంక్ ఖాతాలో ఉన్న డబ్బులు ఖాళీ చేస్తారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు శైలేంద్ర కుమార్, సునీత, ఎస్ఐ రజిత, పోలీస్‌సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగ్గురు అదృశ్యం: కేసు నమోదు



అదృశ్యమైన తల్లీకూతురు

తిమ్మాజిపేట: వేర్వేరు తండాల్లో ముగ్గురు అదృశ్యమైన ఘటనలో బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ హరి ప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం తుమ్మలకుంట తండాలో రమేష్, చిట్టి భార్యభర్తలు. వారి ఇద్దరు పిల్లలను ఇంటి వద్ద ఉంచి ఈ నెల 2న జడ్చర్లకు కూలి పనుల కోసం వెళ్లారు. వీరి పెద్ద కుమారుడు కొడావత్ శంకర్(14) కనిపించడం లేదని రమేష్ సోదరుడు ఫోన్ చేసి చెప్పాడు. తల్లిదండ్రులు తండాకు చేరుకొని వెతికారు. ఎక్కడ కూడా ఆచూకీ లభ్యం కాలేదు. అదేవిధంగా మండలంలోని లక్ష్మణ్ నాయక్ తండాకు చెందిన తల్లీ మన్నీ, కూతురు అవంతిక(10) ఇద్దరు ఈనెల 1న కూరగాయాల కోసం తిమ్మాజిపేటకు వెళ్లారు. ఎంతకు తిరిగి రాకపోవడంతో బంధువులు, తండాలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. బుధవారం మన్నీ సోదరుడు రాములు, బాలుడి తండ్రి రమేష్‌ల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ముమ్మరంగా రెవెన్యూ సదస్సులు



మన్ననూరులో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

సాక్షి, నెట్‌వర్క్: భూ సమస్యల పరిష్కారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా సదస్సులు ఏర్పాటు చేసి రైతుల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు.

- భూభారతి, రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ కోరారు. మన్ననూర్‌లోని రైతు వేదిక ప్రాంగణంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ నెల 20వ తేదీలోపు భూ సమస్యలపై దరఖాస్తు చేసుకోవాలన్నారు. సాదాబైనామాలు, ఇనాం, అసైన్‌మెంట్ భూములపై విచారణ చేసి భూభారతిలో పట్టాలు అందజేస్తారన్నారు.
- కల్వకుర్తి మండలంలోని లింగసానిపల్లి నిర్వహించిన రెవెన్యూ సదస్సులో కల్వకుర్తి ఆర్డీఓ శ్రీను నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. లింగసానిపల్లిలో 28, వెంకటాపురంలో 5 దరఖాస్తులు వచ్చాయని అధికారులు పేర్కొన్నారు. తహసీల్దార్ ఇబ్రహీం, డీటీ కల్మచర్ల రాఘవేందర్ సిబ్బంది పాల్గొన్నారు.
- తెలకపల్లి మండలంలోని కారువంగ, ఆలేరు గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులను ఆర్డీఓ సురేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులు భూ సమస్యల గురించి తెలుసుకున్నారు. కారువంగలో 50, ఆలేరు 82 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. తహసీల్దార్ జాకీర్ అలీ, నాయబ్ తహసీల్దార్ లక్ష్మణ్, శ్రీనివాస్‌రావు, రామస్వామి, రాము, తదితరులు పాల్గొన్నారు.
- తాడూరు మండలంలోని యత్మాతాపూర్, ఎంగంపల్లి గ్రామాల్లో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆర్ఐలు సురేష్, సల్మాన్, ప్రీతం, సురేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.
- కొల్లాపూర్ మండలంలోని చౌటబెట్ల, చింతలపల్లి మొత్తం 43 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ విష్ణువర్ధన్ రావు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ జానయ్య, తదితరులు పాల్గొన్నారు.
- చారకొండ, జూపల్లిలో రైతు వేదికలో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. తహసీల్దార్ సునీత, డిప్యూటీ తహసీల్దార్ విద్యాధరి రెడ్డి, ఎంఆర్ఐలు భరత్ కుమార్ గౌడ్, రామకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ శ్రీను, సర్వేయర్‌లు ఉన్నారు.
- వెల్దండ మండలంలోని బొల్లంపల్లి, గుండాలలో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. బొల్లంపల్లిలో 19, గుండాలలో 34 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. తహసీల్దార్ కార్తీక్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఆర్ఐలు శంకర్, శైలజ, సిబ్బంది పాల్గొన్నారు.
- లింగాల మండలంలోని అవుసలికుంట, రాంపూర్ గ్రామాల్లో భూ భారతి గ్రామ సభలను నిర్వహించారు. పట్టాదార్ పాసు పుస్తకాలలో భూమి విస్తీర్ణం హెచ్చు తగ్గులు, వారసత్వ భూములు, సర్వే నెంబర్ మిస్సింగ్, కొత్త పాసు బుక్కులు రాకపోవడం, విరాసత్, సాదాబైనామా తదితర సమస్యలపై రైతులు దరఖాస్తు చేసుకున్నారు. డీటీ కృష్ణయ్య, జూనియర్ అసిస్టెంట్ సతీష్‌నాయక్, సర్వేయర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.
- బల్మూర్ మండలంలోని జినకుంట, అంబగిరి గ్రామాల్లో 54 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐలు పద్మ, శివ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



కల్వకుర్తి లింగసానిపల్లిలో దరఖాస్తులు పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీను నాయక్



తాడూరు మండలం ఎంగంపల్లి రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అధికారులు

వృద్ధులకు తోడ్పాటునిద్దాం



కల్వకుర్తి రూరల్: సమాజంలో వృద్ధులలకు తోడ్పాటు, గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత అందరిపై ఉందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గురుక జైపాల్ యాదవ్ అన్నారు. బుధవారం పట్టణంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులతో మాట్లాడారు. కుటుంబ ఆదరణకు నోచుకోని వృద్ధులకు ఆశ్రయం కల్పించడంతోపాటు వారికి సేవ చేయడం గొప్ప విషయం అని నిర్వాహకులను ఆయన అభినందించారు. స్వర్ణ భారతి కళానిలయం నిర్వాహకుడు మోహన్‌కు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. నిర్వాహకులు వెంకటయ్య, వృద్ధులు పాల్గొన్నారు.

జర్నలిస్టు పిల్లలకు ఉచిత విద్య

కందనూలు: జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్యను అందించేవిధంగా బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ బాబు సర్క్యులర్ జారీ చేసినట్లు తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (హెచ్–143)జిల్లా అధ్యక్ష,కార్యదర్శి చంద్రశేఖర్, రాజేష్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. టీయూడబ్ల్యూజే (హెచ్–143) యూనియన్ విజ్ఞప్తి మేరకు డీఈఓ స్పందించి సర్క్యులర్ జారీ చేశారని తెలిపారు. జిల్లాలోని అచ్చంపేట, కొల్లాపూర్, కల్వకుర్తి, నాగర్ కర్నూల్ నియోజకవర్గాల పరిధిలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలకు వర్తిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు.

యోగాతో శారీరక దృఢత్వం



నాగర్‌కర్నూల్ క్రైం: యోగాతో శారీరక దృఢత్వం కలుగుతుందని ఆయుష్ వైద్యాధికారి డా.షాబాజ్ మాలిక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో యోగా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి జీవితంలో యోగా సాధన చేయాలన్నారు. ప్రశాంతతతో పాటు ఆరోగ్య ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయన్నారు. యోగా శిక్షకులు సాగర్, రవీందర్, అంజలి పాల్గొన్నారు.

సీపీఐ పట్టణ కార్యవర్గం ఎన్నిక



నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా కేంద్రంలో లక్ష్మణచారి భవన్‌లో సీపీఐ పట్టణ మహాసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు హెచ్ ఆనంద్‌జీ హాజరై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా కపిలావాయి గోపిచారి, సహాయ కార్యదర్శులుగా కోట్రశేఖర్, కొత్త రామస్వామి, కోశాధికారిగా జమీర్, సలహాదారుడిగా నర్సపల్లి ఆనంద్‌జీ, కార్యవర్గ సభ్యులుగా నాగయ్య, జమీర్, సుధాకర్, అంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

ఉప్పునుంతల: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక మండల కాంప్లెక్స్ ఆవరణలో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ ఇంటి వద్ద మండలంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లబ్ధిదారులకు మూడు నెలల కాల వ్యవధిలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలన్నారు. విడతలవారిగా ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా హౌసింగ్ మేనేజర్ సంగప్ప, గ్రంథాలయ జిల్లా చైర్మన్ రాజేందర్, ఎంపీడీఓ మోహన్‌లాల్, నాయకులు అనంతరెడ్డి, నర్సింహరెడ్డి, నర్సింహరావు, అనంతప్రతాప్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, రంగారెడ్డి, లక్ష్మీనారాయణ, నారాయణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

మన్ననూర్: గ్రామానికి చెందిన రచయిత కృష్ణగోపాల్ రచించిన 'సింగిడి సిరులు' పుస్తకం 200 ప్రతులను కాంగ్రెస్ నాయకుల సమక్షంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆవిష్కరించారు. పుస్తకంలోని కొంత భాగాన్ని పరిశీలించిన ఆయన రచయితకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. స్థానిక జంగాల కాలనీకి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు 10 మంది కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎంఏ రహీం, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ సురేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు. మన్ననూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడుగా ఎన్నికైన డాక్టర్ పిట్టల సురేష్‌ను ఎమ్మెలే వంశీకృష్ణ స్వీటు తినిపించి శాలువతో సన్మానం చేశారు. గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, ఆర్డీఓ మాధవి, తహసీల్దార్ శైలేంద్ర కుమార్, నాయకులు శ్రీనివాసులు, మల్లేష్, హరినారాయణ, నాయకులు మాజీ ఎంపీటీసీలు రహీం, శ్రీనివాసులు, రవి బాలమ్మ, వెంకటరమణ, హన్మంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన



మాధవస్వామినగర్‌లో అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

పెంట్లవెల్లి: మండలంలోని మంచాలకట్ట, మాధవ స్వామినగర్, ఎంగంపల్లితండా గ్రామాల్లో టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆపరేషన్ నిజా పాఠశాల కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు చదువు ప్రాధాన్యాన్ని వివరించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యతోపాటు చక్కనైన ఆటలు, నాణ్యమైన భోజనం, డ్రాయింగ్, ఉచిత దుస్తులు, పాఠ్యపుస్తకాలు, స్కాలర్‌షిప్‌లు అందుతాయని తెలిపారు. టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు కుమారస్వామి, ఆంజనేయులు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రచార జాత

తెలకపల్లి: పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని యూటీఎస్ మండల అధ్యక్షుడు కె. సునీల్ కుమార్ కోరారు. బుధవారం మండలంలోని గడ్డంపల్లి, గౌతంపల్లి గ్రామాల్లో ప్రచార జాత నిర్వహించారు. గ్రామాల్లో యూటీఎఫ్ బృందం ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తుందన్నారు. దుస్తులు, పుస్తకాలు, భోజనం, రాగిజావ ఉచితంగా ఇస్తుందన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి వెంకట్, రమేష్, చంద్రమౌళి, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా కరుణాకర్‌గౌడ్

కొల్లాపూర్: నియోజకవర్గ గౌడ ఉద్యోగుల సంఘం నూతనం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం పట్టణంలోని మాధవస్వామి దేవాలయ ఆవరణలో గౌడ ఉద్యోగులు సమావేశం అయ్యారు. జై గౌడ్ ఉద్యమం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గుంద్రాతి నారాయణగౌడ్, నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్ సమక్షంలో ఉద్యోగుల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. నియోజకవర్గ కమిటీ అధ్యక్షుడిగా బండారు కరుణాకర్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా పలుస రాజుగౌడ్‌లు ఎన్నికయ్యారు. అనంతరం జై గౌడ ఉద్యమం నియోజకవర్గ అధ్యక్షుడిగా పటపర్ల శివన్నగౌడ్, ప్రధాన కార్యదర్శిగా నరేందర్‌గౌడ్, కార్యదర్శిగా రామకృష్ణగౌడ్, గుర్రం వెంకటస్వామిగౌడ్, సోషల్‌మీడియా కన్వీనర్‌లుగా వినోద్‌గౌడ్, కిరణ్‌కుమార్‌గౌడ్‌లను ఎంపికచేశారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు సన్మానించారు. కార్యక్రమంలో సుదర్శన్‌గౌడ్, జ్యోతిగౌడ్, రాజేందర్‌గౌడ్, భాస్కర్‌గౌడ్, నర్సింహగౌడ్ తదితరులు ఉన్నారు.

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై ఆరోపణలు సరికాదు



తెలకపల్లి: ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని స్వేరోస్ నాయకులు శివశంకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ సామ రామ్మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని అన్నారు. చిత్తశుద్ధి ఉంటే గురుకులాల్లో ఒకేషనల్ కోర్సు ప్రవేశపెట్టేందుకు కృషి చేయాలని సూచించారు. సెంటర్ ఎక్సలెన్సు పాఠశాలలను స్థాపించాలని అన్నారు. కార్యక్రమంలో ధర్మరాజు, సంపత్‌కుమార్, మల్లేష్, విరస్వామి, రామకృష్ణ, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన పూజలు



సీతారామాంజనేయ స్వామి ఆలయం

పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్‌లో గురువారం నుంచి మూడు రోజుల పాటు సీతారామాంజనేయ స్వామి, సత్యనారాయణ స్వామి విగ్రహ ప్రతిష్ఠ, ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 5వ తేదీన మహాగణపతి పూజ, గోపూజ, యాగశాల, మండప పూజ, 6 న రుద్ర పారాయణం, ఆవాహిత దేవతా పూ జలు, రుద్రాభిషేకం, 7న విగ్రహాల ప్రతిష్ఠ, ధ్వజస్తంభ, బొడ్రాయి ప్రతిష్ఠ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించే పూజల్లో భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

3 ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

పాన్‌గల్: మండలంలోని చిక్కేపల్లికి చెందిన మూడు ఇసుక ట్రాక్టర్ల యజమానులపై కేసు నమోదైన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి కానిస్టేబుళ్లు కేబీ మల్లేష్, మన్సూర్ పాన్‌గల్ ఎస్‌బీఐ సమీపంలో గస్తీ తిరుగుతుండగా ఈదమ్మ గుడి వైపు నుంచి ఇసుక లోడ్‌తో మూడు ట్రాక్టర్లు కనిపించడండతో వాటిని ఆపారు. ఇసుకు తరలింపునకు అనుమతులు ఉన్నాయా అని అడుగగా ఎలాంటి పత్రాలు చూపలేదు. దీంతో ఇసుక ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి డ్రైవర్లు జలకంటి ఆంజనేయులు, మండ్ల మహేందర్, నాగరాజుపై బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.



పైపులైన్ నిర్మాణంతో హర్షం



వీపనగండ్ల: మండలంలోని కల్వరాల మొదటి వార్డులో మినీ ట్యాంక్‌లు ద్వారా తాగునీరు సరఫరా అయ్యేందుకు అవసరమైన పైపులైన్ నిర్మాణం కోసం మంత్రి సహకారంతో నిధులు మంజూరయ్యాయని నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నర్సింహ తెలిపారు. గతంలో ఉన్న మినీ ట్యాంక్‌కు నీటి సరఫరా లేక పరిసర గృహాల ప్రజలు ఇబ్బందులకు గురయ్యారన్నారు. దీంతో నూతనంగా పైపులైన్ ఏర్పాటు చేసి తాగునీటి సరఫరా చేయిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో భగీరథ ఏఈ విశ్వనాథం, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

కేతేపల్లిలో కొండచిలువ కలకలం



కాలనీవాసులు చంపిన కొండచిలువ

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి ఎస్సీ కాలనీలో మంగళవారం రాత్రి కొండచిలువ కలకలం రేపింది. కాలనీలో కొండ చిలువను చూసి కాలనీవాసు లు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. చల్లటి వాతావరణం, కప్పలు కోసం ఇంటి పరిసరాలకు కొండచిలువ వచ్చినట్లు కాలనీవాసులు అనుమానం వ్యక్తం చేశారు. కాలనీలో కనిపించిన కొండ చిలువను అందరూ కలిసి చంపినట్లు వారు పేర్కొన్నారు. వర్షాకాలం కావడంతో ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే విష పురుగులు రాకుండా ఉంటాయని పలువురు వాపోయారు.